## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నర్సాపూర్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు పథకంతో ఎంతో మేలు చేకూరుతుందని ఆయన చెప్పారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అలయ్‌బలయ్

నర్సాపూర్: దసరా పండుగను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, గౌరవ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌గుప్తాలతో పాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆరు గ్యారంటీల అమలుకు ఇందిరమ్మ కమిటీలు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు ఇందిరమ్మ కమిటీలు క్రియాశీలకంగా పనిచేయనున్నాయని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు అన్నారు. సోమవారం నార్సింగిలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అర్హులను గుర్తించి, పేదలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వ ఇందిరమ్మ కమిటీలను నియామకం చేస్తుందన్నారు.

### సన్మానం



డీఎస్సీ విజేతలను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, అధ్యాపకులు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు డీఎస్సీ–2024లో ఎంపికయ్యారు. దీంతో వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, అధ్యాపకులు సన్మానించారు. ఆంగ్ల అధ్యాపకులు కె.రవీందర్ ఎస్‌జీటీ విభాగంలో 51వ ర్యాంకు సాధించగా, హిందీ అధ్యాపకులు మహ్మద్ సమీ హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకును సాధించినందుకు ప్రశంసించారు.

### పంటల పరిశీలన



చిట్టోజిపల్లిలో వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి హరిప్రసాద్

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్టోజిపల్లి గ్రామంలో సోమవారం వ్యవసాయ అధికారి హరిప్రసాద్ వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలో దోమ ఉధృతిని గుర్తించినట్లు పేర్కొన్నారు. వరి మడుల్లో నీరు లేకుండా చేసి గాలి వెలుతురు వచ్చేలా చూడాలని సూచనలు చేశారు. దోమ ఉధృతి తీవ్రంగా ఉంటే రసాయన ఎరువులను పిచికారీ చేసుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యకర వాతావరణం



పారిశుద్ధ్య కార్మికులతో హరినాథశర్మ

కొండపాక(గజ్వేల్): సక్రమమైన పారిశుద్ధ్య నిర్వహణతోనే ఆరోగ్యవంతమైన వాతావరణం నెలకొంటుందని విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెప్పెల హరినాథశర్మ అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో శరన్నవరాత్రోత్సవాల్లో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను సోమవారం సన్మానించి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్షేత్రం ఆవరణలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా కార్మికులు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, ట్రస్టు సభ్యులు నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్, రాజేంద్రప్రసాద్, బాలరాజు, సురేశ్, విఠల్, మల్లేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన దేవీశరన్నవరాత్రులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. సోమవారం రాత్రి ఆయా గ్రామాల్లో అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలు కనుల పండుగగా జరిగాయి. పేట గంగపుత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అమ్మవారిని ఊరేగించి నిమజ్జనం చేశారు.

**దుర్గామాత విగ్రహాల నిమజ్జనం**

కొల్చారం(నర్సాపూర్): తొమ్మిది రోజుల పాటు భక్తులతో పూజలు అందుకున్న దుర్గామాత విగ్రహాల నిమజ్జనం సందడిగా మారింది. మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయలకు వెళ్లే దారి మధ్యలోని బ్రిడ్జిలపై నుంచి అమ్మవారి విగ్రహాలను నదిలో నిమజ్జనం చేసేందుకు జిల్లాల్లోని ప్రాంతాల నుంచే కాకుండా మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలించారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు అమ్మవారిని తీసుకొచ్చిన వాహనాలతో పాటు వాటి వెంట వచ్చిన భక్తుల వాహనాలు రెండు కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భక్తులే స్వయంగా వాహనాల రాకపోకలను పునరుద్ధరించే పనులు చేశారు.



పెద్దశంకరంపేటలో దుర్గమ్మ నిమజ్జనం



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లిలో దుర్గామాత నిమజ్జనం

**గంగమ్మ ఒడికి దుర్గమ్మతల్లి**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి దుర్గామాత నిమజ్జనం పూర్తయింది. గుండు చెరువులో చివరిపూజలు నిర్వహించి, అమ్మవారిని చెరువులో నిమజ్జనం చేశారు.

**దుర్గామాత శోభాయాత్ర ప్రారంభం**

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీ.కొండాపూర్‌లో దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు.



చేగుంట(తూప్రాన్): బీకొండాపూలో అమ్మవారికి పూజల్లో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

# సమస్యలు పరిష్కరించండి



నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఆర్టిజన్‌లు

నర్సాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లను కలిసి వినతిపత్రం అందించారు. జేఏసీ చైర్మన్ రాములు, ఇతర ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, దుర్గేశ్, నాగరాజు, సురేశ్ తదితరులు ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఇన్‌చార్జిను కలిసి తమ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న తమను రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ చేయించేందుకు కృషి చేయాలని కోరారు. తాము పనిభారం ఎక్కువైందని, వేతనం తక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే, రాజిరెడ్డి ఆర్టిసన్ కార్మికులకు హామీ ఇచ్చారు.

# పట్టాలు ఇవ్వాలని దరఖాస్తు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్టోజిపల్లి శివారులోని భూములకు పట్టాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులు ప్రజావాణిలో దరఖాస్తు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి మాట్లాడుతూ.. గ్రామ శివారులో 266/1 సర్వే నంబర్ భూమిల్లో ఏళ్ల తరబడి గ్రామస్తులు పంటలు వేస్తున్నారని తెలిపారు. వారందరికీ పట్టాలు అందించాలని ప్రజావాణిలో తహసీల్దార్ నారాయణకు దరఖాస్తు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టోజిపల్లి భూపోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చేగుంట(తూప్రాన్): తహసీల్దార్‌కు దరఖాస్తు అందిస్తున్న చిట్టోజిపల్లి రైతులు

**పింఛను మంజూరు చేయండి**

నర్సాపూర్: తాను 58 ఏళ్లు ఉన్నా తనకు వృద్ధాప్య పింఛను రావడం లేదని మండలంలోని జక్కపల్లికి చెందిన జమునగల్ల కిష్టయ్య సోమవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి ప్రజావాణిలో వినతపత్రం అందజేశారు. తాను గత 40 ఏళ్ల నుంచి గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలకు డప్పు చాటింపు వేస్తూ ప్రజాసేవ చేస్తున్నానని తనకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయించాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా తమ కార్యాలయంలో ఒక దరఖాస్తు వచ్చినట్లు మండల తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

**నేడు అవార్డు విచారణ**

ట్రిపుల్ ఆర్ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులతో మంగళవారం అవార్డు విచారణ కార్యక్రమాన్ని రైతు వేదికలో ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి, మధ్యాహ్నం శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామాల రైతులతో అవార్డు విచారణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని తమ అభ్యంతరాలుంటే తమకు తెలుపాలని, లేనిపక్షంలో అవార్డును ప్రకటిస్తామని చెప్పారు.

# దసరా శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



హరీశ్‌రావుకు శుభాకాంక్షలు చెప్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): దసరా వేడుకలను పురస్కరించుకొని తాడ్‌దాన్‌పల్లిలో సోమవారం అలయ్ బలయ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నిమ్మ రమేశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నర్సాపూర్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును నియోజకవర్గంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ తదితరులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

# రెండో రోజు కొనసాగిన వాహనాల రద్దీ

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- కౌంటర్‌లు పెంచాలంటూ సూచనలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ శివారులోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం సాయంత్రం కూడా వాహనాల రద్దీ కొనసాగింది. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో సొంత ఊర్లకు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండడంతో టోల్‌ప్లాజా వద్ద రద్దీ పెరిగింది. సుమారు రెండు వందల మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరుస పండుగల నేపథ్యంలో టోల్‌ప్లాజాలోని కౌంటర్ల సంఖ్యను తాత్కాలికంగా పెంచినప్పటికీ రద్దీని అరికట్టలేకపోయారు. దీంతో ఒక్కొక్క వాహనం టోల్ దాటేందుకు గంట సమయం పట్టిందని వాహనదారులు వాపోయారు. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా కౌంటర్లను పెంచేలా చూడాలని కోరారు.



టోల్‌ప్లాజా వద్ద నిలిచిపోయిన వాహనాలు

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ – మెదక్ రహదారిలోని రెడ్డిపల్లి సమీపంలో ఆదివారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో గాయపడిన వారిని హైదరాబాదులోని ఆయా ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ చింతల్ శ్రీరామ నగర్ కాలనీకి చెందిన మాచర్ల సిద్దు (24) సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ లింగం తెలిపారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

### 16న బైక్‌ల వేలం

నర్సాపూర్: పలు కేసుల్లో పట్టుబడిన మూడు బైకులు ఈనెల 16న వేలం వేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పద్మ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. గంజాయి రవాణా, అబ్కారీ కేసుల్లో మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని వాటిని ఉన్నతాధికారుల సూచనల మేరకు 16న వేలం వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేన వ్యక్తులు తమ కార్యాలయంలో పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

### మీసేవ నిర్వాహకుడిపై ఫిర్యాదు

తూప్రాన్: తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతరాజుపల్లిలో మీసేవ కేంద్రాన్ని నడుపుతున్న మన్నెరాజు భూకబ్జాలకు పాల్పడుతున్నాడని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు రావెల్లి గ్రామానికి చెందిన కానుకుంట గణేశ్ ఫిర్యాదు చేశాడు.

### పిడుగుపాటుకు లేగదూడ మృతి



టేక్మాల్(మెదక్): పిడుగుపాటుకు లేగదూడ మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని చల్లపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లపల్లి గ్రామానికి చెందిన మస్కూరి శంకర్ తన వ్యవసాయ క్షేత్రం వద్ద ఆవును లేగ దూడను వేర్వేరుగా చెట్ల కింద కట్టేసి మేత వేశాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రమాదవశాత్తు లేగదూడను కట్టేసిన చెట్టుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

# వైభవంగా శివపార్వతుల కల్యాణం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని బాచారం గ్రామంలో సోమవారం శివాలయం సమీపంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా బాచారంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరాములు, మాజీ ఉపసర్పంచ్ రాముగుప్తా, మాజీ ఎంపీపీ పవిత్రదుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# తండా రోడ్డును పూర్తి చేయండి

నర్సాపూర్ రూరల్: అసంపూర్తిగా వదిలేసిన విఠల్ తండా రోడ్డును పూర్తి చేయాలని ఆ తండా గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని విఠల్ తండా రోడ్డుకు ఆర్అండ్‌బీ నుంచి రూ. 54 లక్షలు మంజూరైన నిధులతో బ్రాహ్మణపల్లి – తుజాల్‌పూర్ పీడబ్ల్యూ రోడ్డు నుంచి విఠల్ తండా వరకు ఉన్న కంకర రోడ్డును తారురోడ్డుగా మార్చేందుకు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఒక లేయర్ సన్న కంకర వేసి, కొన్ని నెలలుగా పనులు చేయకుండా అసంపూర్తిగా వదిలేశాడు. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజనులు వాపోయారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా.. కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చి, పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



తారు వేయకుండా కంకర వేసి, వదిలేసిన విఠల్ తండా రోడ్డు

# అదనపు చార్జీలకు నిరసనగా రాస్తారోకో

నర్సాపూర్: ఆర్టీసీ అధికారులు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు సోమవారం రాస్తారోకో చేశారు. దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెగ్యులర్ సర్వీసులు తక్కువ చేసి, స్పెషల్ బస్సుల పేరిట అన్ని ఆర్టీసీ సర్వీసుల్లో అదనపు చార్జీలు వసూలు చేయడంతో తాము నష్టపోతున్నామని ఆరోపించారు. అదనపు చార్జీలు రద్దు చేయాలన్న డిమాండ్‌తో ప్రయాణికులు బస్టాండ్ అవుట్ గేట్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి ప్రయాణికులకు నచ్చ చెప్పడంతో వారు రాస్తారోకో విరమించారు. కాగా ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్ అక్కడికి వచ్చి ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తుందని ప్రయాణికులకు చెప్పారు. స్పెషల్ సర్వీసులు తీసి వేయగానే అదనపు చార్జీలు ఎత్తి వేస్తారని వివరించారు.



నర్సాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న ప్రయాణికులు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చల్మెడలో గురువులతో పూర్వ విద్యార్థులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మేడ గ్రామంలో సోమవారం ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో 2005–06 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు వారి గురువులను శాలువాలతో సన్మానించారు. అనంతరం అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.తిరుపతి, కన్యాలాల్, భూపాల్, వై.తిరుపతి, శంకర్, పృథ్వీదర్ రావు, రామచంద్రం, వేణుగోపాల్, సత్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాదయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీరాములు

మిరుదొడ్డి(దుబ్బాక): మాలల హక్కుల సాధనకై 25న తలపెట్టిన మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ భద్రాచలం నుంచి హైదరాబాద్ రవీంద్రభారతి వరకు సాగే ఈ పాదయాత్రకు వేలాదిగా తరలివచ్చి భాగం కావాలన్నారు. కార్యక్రమంలో ధారస్వామి, యాదగిరి, సుమన్, రాజు, రమేష్, కనకయ్య, లక్ష్మణ్, పరశురాములు, చిన్నరాజు, రాజేందర్, కిషోర్, శ్రీనివాస్, యాదగిరి, రాగరాజు, నగేష్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

మిరుదొడ్డి(దుబ్బాక)/తొగుట(దుబ్బాక)/దుబ్బాక టౌన్/దౌల్తాబాద్ (దుబ్బాక): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ధర్మారం, తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డు, రాయపోల్ మండల కేంద్రంలోను, అలాగే దౌల్తాబాద్ మండల పరిధిలోని గోవిందాపూర్‌లోను సోమవారం ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధరను పొందాలన్నారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాను ప్రారంభించకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటామని ప్రకటించడం దుర్మార్గమని వాపోయారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్, జిల్లా సివిల్ సప్లయి అధికారి రాజిరెడ్డి, ఏపీఎం డాకయ్య, ఎంపీఓ జహీరొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు సూకూరి లింగం, అంజిరెడ్డి, బాల్‌రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, బాగులు, దుర్గారెడ్డి, యాదాకృష్ణ, మైసయ్య, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, తహసీల్దార్ శ్రీకాంత్, ఏఎంసీ కార్యదర్శి స్వామి, డీపీఎం రాజయ్య, ఏపీడీ మధుసూదన్, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమురయ్య, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు స్వామి, రమేశ్, రాంరెడ్డి, డీపీఎం రాజయ్య, డీఆర్డీఏ ఏపీడీ మధుసూదన్, తహసీల్దార్ దివ్య, ఎంపీడీవో బాలయ్య, ఏపీఎం కిషన్, ఏవో నరేశ్, ఎంపీవో శ్రీనివాస్, ఆర్ఐ భాను ప్రకాశ్, కిష్టయ్య, రాజేశ్వర్‌రావు, శివకుమార్, ఏఈవో రజిత పాల్గొన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): ధర్మారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి